సాక్షి
ఖమ్మం
బుధవారం ; 27 ; డిసెంబర్ ; 2023



కొనలేం.. తినలేం

తుపాన్ ప్రభావంతో తోటలు దెబ్బతినగా కూరగాయలు ధరలు పెరిగి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 8లో



పిచ్ అదిరింది..

ఖమ్మంలోని పటేల్ స్టేడియంలో ప్రారంభమైన ఆస్ట్రో టర్ఫ్ వికెట్‌తో ఔత్సాహిక క్రికెటర్లు ఆసక్తిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
30° / 17°

జిల్లా అంతటా బుధవారం కూడా చలి ప్రభావం కొనసాగుతోంది. సాయంత్రం తర్వాత చలి తీవ్రత మరింత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు 'నిధి ఆప్‌కే నిఖత్'

ఖమ్మం సహకారనగర్: ఉద్యోగుల భవిష్యత్ నిధి సంస్థ(ఈపీఎఫ్ఓ) ఆధ్వర్యాన బుధవారం 'నిధి ఆప్‌కే నిఖత్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఖమ్మం జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.సునీల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉద్యోగుల ఆన్‌లైన్ సేవల విధివిధానాలు, జీవన్‌ప్రమాణ్ సేవలపై అవగాహన కల్పించడమేకాక పెన్షనర్ల సమస్యలు తెలుసుకుంటామని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా వాసులు ఏదులాపురం పీఏసీఎస్‌లో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులు ఇల్లెందు మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో జరిగే కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు.

ఖమ్మం నుంచి శ్రీశైలంకు ప్రత్యేక బస్సు



ఖమ్మం మామిళ్లగూడెం: శ్రీశైలం వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఖమ్మం హైదరాబాద్ మీదుగా బుధవారం నుండి కొత్త సూపర్ లగ్జరీ సర్వీస్(8600) ఏర్పాటుచేసినట్లు ఖమ్మం డిపో మేనేజర్ బి.శ్రీనివాస్ తెలిపారు. ఈ సర్వీస్ ప్రతిరోజు ఖమ్మం కొత్త బస్టాండ్ నుండి రాత్రి 11–55 గంటలకు బయలుదేరి హైదరాబాద్‌కు మరుసటి రోజు ఉదయం 5–15గంటలకు చేరుకోనుండగా, శ్రీశైలంకు 10–45గంటలకు చేరుతుందని పేర్కొన్నారు. ఇదేబస్సు 8601 నంబర్‌తో శ్రీశైలం నుండి సాయంత్రం 5–30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 3–45 గంటలకు ఖమ్మం చేరుకుంటుందని తెలిపారు. ఈ బస్సుకు అడ్వాన్స్ రిజర్వేషన్ సదుపాయం కూడా ఉన్నందున భక్తులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

జమలాపురంలో గిరిప్రదక్షిణ



ఉత్సవ విగ్రహంతో గిరిప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, సిబ్బంది

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీవారు, అమ్మవార్లకు అర్చకులు పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై పెద్దసంఖ్యలో హాజరైన భక్తుల సమక్షాన ఊరేగింపుగా గిరి ప్రదక్షణ చేయించారు. ఈకార్యక్రమంలో సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు ఉప్పల విజయదేవశర్మ, రాజీవ్‌శర్మ, రామకృష్ణ, వేదపండితులు విజయకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి పోటీలు



ఇల్లెందురూరల్: గిరిజన గురుకులాల విద్యార్థుల రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు ఈనెల 28వ తేదీ నుంచి జరగనుండగా, విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగం కృషి చేయాలని ఖమ్మం రీజియన్ గిరిజన గురుకులాల పర్యవేక్షకుడు తమికి వెంకటేశ్వరరావు సూచించారు. ఇల్లెందు మండలం సుభాష్‌నగర్ గురుకుల పాఠశాలలో పోటీలు జరగనున్న నేపథ్యాన, మంగళవారం ఏర్పాటుచేసిన సమీక్షలో ఆయన మాట్లాడారు. క్రీడాపోటీలను ఎలాంటి లోటుపాట్లు ఎదురుకాకుండా నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. పోటీల నిర్వహణ, వసతి, భోజన సౌకర్యాల కోసం కమిటీలు నియమించాలని సూచించారు. ఈసమావేశంలో సుభాష్‌నగర్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి, రీజియన్ పరిధిలోని గిరిజన గురుకులాల ప్రిన్సిపాళ్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కోర్టు ఉద్యోగుల డిప్యుటేషన్ పొడిగింపు

కొత్తగూడెంటౌన్: ఖమ్మం జిల్లా నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విభజన సమయాన కొత్తగూడెం కోర్టులో సిబ్బంది కొరత కారణంగా 18 మందిని ఖమ్మం నుంచి డిప్యుటేషన్‌పై పంపించారు. అయితే వీరి డిప్యుటేషన్‌ను రద్దు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను నిలిపివేయాలని కొత్తగూడెం బార్ అసోసియేషన్ సభ్యులు చేసిన విజ్ఞప్తికి హైకోర్టు సానుకూలంగా స్పందించింది. ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేయగా, ఈనెల 27వ తేదీతో ముగిసే డిప్యుటేషన్ గడువును జనవరి 31 వరకు హైకోర్టు పొడిగించిందని బార్ అసోసియేషన్ బాధ్యులు వెల్లడించారు.

రేపటి నుంచి ప్రజాపాలన



మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పక్కన మంత్రులు పొంగులేటి, తుమ్మల, భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ వినీత్, ఖమ్మం అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ తదితరులు

- పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం
- గ్రామసభల ద్వారా అర్జీల స్వీకరణ, పరిష్కారం
- సమీక్షలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- హాజరైన మంత్రులు పొంగులేటి, తుమ్మల నాగేశ్వరరావు



హాజరైన ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులు

ఖమ్మం సహకారనగర్: అర్హులైన ప్రజలందరికీ ఎన్నికలకు ముందు ప్రకటించిన సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ఆర్జీలు స్వీకరించేందుకు గురువారం నుంచి ప్రజాపాలన సభలు నిర్వహించనున్నట్లు ప్రజాపాలన జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన మంగళవారం ఖమ్మం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారంటీల అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన సభలు నిర్వహిస్తోందని తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నందున అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. ఈనెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.

అధికారులు కష్టపడి పనిచేయాలి

గత పదేళ్లలో రాష్ట్రంలోని పేదలకు ఇళ్లు, రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులు, యువతకు ఉద్యోగాలు ఇవ్వలేక పోయారని కోమటిరెడ్డి తెలిపారు. ఈ నేపథ్యాన ప్రజాపాలన గ్రామసభల ద్వారా సమస్యలు ఒక్కొక్కటి పరిష్కరించాలని సూచించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన నేపథ్యాన పనులకు వెళ్లేందుకు ఉపయోగకరంగా మారిందని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి కూడా పెంచామని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పేదలు, గిరిజనులు ఎక్కువగా ఉన్నందున అధికారులు మరింత కష్టపడుతూ బాధ్యతగా, సంయమనంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ సమావేశంలో సత్తుపల్లి, భద్రాచలం ఎమ్మెల్యేలు డాక్టర్ మట్టా రాగమయి, డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఖమ్మం జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ ఆదర్శ్ సురభి, భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, భద్రాద్రి అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్‌రాజుతోపాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎవరేం అన్నారంటే....

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తమది సంక్షేమ ప్రభుత్వం, ఇందిరమ్మ రాజ్యమని తెలిపారు. ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా ఇచ్చిన హామీలను తు.చ. తప్పక అమలు చేస్తామన్నారు. ప్రజాపాలనపై అధికారులు స్పష్టతతో ఉండి ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని సూచించారు.
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు చేరువగా పాలన అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. గ్రామసభల షెడ్యూల్ ముందస్తుగా తెలియజేస్తూ ప్రజలకు ఇబ్బంది లేకుండా దరఖాస్తులు స్వీకరించాలని చెప్పారు. అధికారులు సమష్టిగా కృషి చేస్తేనే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల మాట్లాడుతూ నిర్ణీత తేదీల్లో రెండు షిఫ్టుల్లో ప్రజా పాలన సభలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలోని 22 మండలాల్లో 481గ్రామపంచాయతీలు, నాలుగు మునిసిపాలిటీల్లో 114వార్డులు ఉండగా, జనాభాకు అనుగుణంగా బృందాలను నియమించినట్లు పేర్కొన్నారు.
- భద్రాద్రి ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ ప్రజాపాలన సభలకు బందోబస్తు ఏర్పాటు చేయనుండగా, సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. వయోవృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు.
- ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని 21 మండలాల్లో 589 గ్రామపంచాయతీలు, కేఎంసీ, మూడు మున్సిపాలిటీల్లో 125 వార్డులు ఉండగా, సభల నిర్వహణకు 59 బృందాలను ఏర్పాటుచేశామని తెలిపారు.

దోచుకున్న సొమ్మంతా రాబడుతాం

ఖమ్మం సహకారనగర్: గత ప్రభుత్వంలో పాలకులు దోచుకున్న సొమ్ము ఇవ్వాల్సిన అవసరం లేదని.. అదంతా ఎలా రాబట్టుకోవాలో తెలుసని, రాబట్టి తీరుతామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం కలెక్టరేట్‌లో ప్రజాపాలనపై సమీక్ష అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజుల్లోనే రెండు గ్యారంటీలు అమలు చేశామని, మిగతావి కూడా వంద రోజుల్లోగా అమలు చేస్తామని తెలిపారు. రెండు రోజుల్లోనే రెండు స్కీమ్‌లు అమలుచేసిన ఘనత దేశంలో ఏ ప్రభుత్వానికి లేదని చెప్పారు. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టును రూ.1.80లక్షల కోట్లు అప్పు చేసి నిర్మించగా లోపాలు బయటపడగా, 75ఏళ్ల క్రితం నిర్మించిన నాగార్జునసాగర్ డ్యామ్ మాత్రం చెక్కు చెదరలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పాత ప్రాజెక్టులను పక్కన పెట్టి వారికి ఇష్టమైనవి నిర్మించారని.. మల్లన్నసాగర్, కొండపోచమ్మను నిర్మించినా ఆయకట్టుకు నీళ్లు ఇవ్వలేదని తెలిపారు. విధ్వంసమైన తెలంగాణను గాడిలో పెడుతున్నామని, కాంగ్రెస్‌ను గెలిపించిన ప్రజలకు పారదర్శకంగా పరిపాలన అందిస్తామని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ఆధ్వర్యాన వచ్చే ఐదేళ్లలో ఉమ్మడి ఖమ్మంను సమస్యలు లేని జిల్లాగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. అనంతరం పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు చిత్తశుద్ధితో ఉందని, మాటలతో కాకుండా చేతల్లో పనితీరు చూపిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నామని చెప్పారు. విద్యుత్ సమస్యపై తాము ప్రశ్నిస్తే సబ్‌స్టేషన్లలోని లాగ్‌బుక్‌లు మాయం చేశారని పేర్కొన్నారు. మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ నాగపూర్–అమరావతి జాతీయ రహదారులు, సూర్యాపేట – రాజమండ్రి, కోదాడ – కురవి, కొత్తగూడెం – వలిగొండ రహదారులను పూర్తిచేయించే బాధ్యత తీసుకుంటామని తెలిపారు. నల్లగొండతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలను సస్యశ్యామలం చేసేలా సాగునీరు తీసుకొస్తామని వెల్లడించారు.

వాడేద్దాం.. ఆడేద్దాం

జనం డబ్బే కదా...

- బ్యాంకులో డిజిటల్ సంతకం ట్యాంపరింగ్
- సత్తుపల్లి యాక్సిస్ బ్యాంక్ ఉద్యోగుల బాగోతం
- వినియోగదారుల డబ్బుకు ధోకా లేదంటున్న అధికారులు

సత్తుపల్లి: ఎంతో నమ్మకంగా బ్యాంకులో జనం దాచుకున్న డబ్బుతో ఉద్యోగులు ఆడిన దొంగాట కలకలం రేపుతోంది. బ్యాంకుల్లో తరచుగా వెలుగు చూస్తున్న మోసాలు ఖాతాదారులను ఉలిక్కిపడేలా చేస్తున్నాయి. సత్తుపల్లి యాక్సిస్ బ్యాంకులో ఉద్యోగుల చేతివాటంపై 'సాక్షి'లో 'రూ.కోటిన్నర హాంఫట్', 'దాచినా దాగలేదు' శీర్షికలతో వరుస కథనాలు ప్రచురితం కాగా ప్రజల్లో చర్చనీయాంశమైంది. ఖాతాదారులెవరూ బహిరంగంగా నోరు మెదపకున్నా తమ నగదు నిల్వలపై స్టేట్‌మెంట్లు తీసుకుంటున్నట్టు సమాచారం. డిపాజిట్ పత్రాలను సరిచూసుకోవడం, కొందరు తమ నగదును ఇతర బ్యాంకు ఖాతాల్లోకి ట్రాన్స్‌ఫర్ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

మేనేజర్ లేకపోవడమే అదునుగా..

యాక్సిస్ బ్యాంక్‌లో పనిచేసిన మేనేజర్‌కు ఇతర ఉద్యోగం రావటంతో మూడు నెలల క్రితం రాజీనామా చేశారు. ఆ సమయాన డిప్యూటీ మేనేజర్ కె.ప్రశాంత్‌కు మేనేజర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో జనం డబ్బులను కాజేయడం సులువైంది. పెద్దమొత్తంలో నిల్వ ఉన్న ఖాతాదారులకు చెందిన అకౌంట్లు, డిపాజిట్ల సమాచారం అందుబాటులోకి రావటంతో డిజిటల్ సంతకాలను ట్యాంపరింగ్ చేసి నగదును సులువుగా అసిస్టెంట్ మేనేజర్ గూడూరు సైదుల్‌రెడ్డి భార్య స్వప్న అకౌంట్‌లోకి మార్చినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. దీనికి ఉద్యోగులు కాట్రాల చెన్నారావు, సైదుల్‌రెడ్డి సహకరించడంతో కేవలం నెలన్నర వ్యవధిలో సుమారు రూ.కోటిన్నర నగదు స్వాహా చేసినట్లు సమాచారం. ఖాతాదారుల సెల్‌ఫోన్లకు మెసేజ్ వెళ్లకుండా ఆన్‌లైన్‌లో నంబర్లు మార్చి పకడ్బందీగా అక్రమాలకు పాల్పడినట్టు తెలిసింది. అయితే, డిపాజిట్ చేసిన చెక్కు నగదు అకౌంట్‌లో జమ కాకపోవడంతో ఓ ఖాతాదారుడు సంప్రదించగా ప్రశాంత్ సర్దిచెప్పి పంపించారు. ఆతర్వాత డబ్బు అవసరమైన ఇంకొందరు వస్తుండగా, ఖాతాలో నిల్వ లేకపోవడంతో ఉద్యోగుల చేతివాటం బయటపడింది. ఇందులో కొందరికి ప్రైవేట్‌గా సెటిల్‌మెంట్ చేశారు. అయినా మరికొందరు వస్తుండడంతో ప్రశాంత్, చెన్నారావు, సైదుల్‌రెడ్డి బ్యాంకుకు రాకుండా ముఖం చాటేశారు. దీంతో నూతన బ్యాంకు మేనేజర్‌గా విధుల్లో చేరిన నాగరాజు ఇక్కడ జరిగిన అక్రమాలపై బ్యాంకు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడమే కాక అంతర్గత విచారణ చేపట్టగా మోసాలు బయటపడ్డాయి. అనంతరం బాధితులకు బ్యాంకు నుంచి లెటర్లు ఇచ్చినట్లు తెలిసింది. ఈమేరకు బ్యాంకు ప్రస్తుత అధికారులు కూడా వినియోగదారుల డబ్బుకు ఎలాంటి ధోకా లేదని భరోసా ఇస్తున్నా చేతికందే వరకు ప్రజల్లో ఆందోళన కొనసాగే అవకాశముంది.

నెలకు రూ.లక్ష మాత్రమే..

యాక్సిస్ బ్యాంకు సత్తుపల్లి శాఖలో నెలకు రూ.లక్ష మాత్రమే నగదు డిపాజిట్, డ్రా చేసుకునే అవకాశం ఉంది. అంతకంటే ఎక్కువ డబ్బు దాచుకోవాలన్నా.. డ్రా చేయాలన్నా బ్యాంకు ఉద్యోగుల సహకారం తప్పనిసరి కావడంతో కొందరికి ఉద్యోగులతో సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. ఇదే అదునుగా ఖాతాదారులతో ఉన్న పరిచయాన్ని ప్రశాంత్, చెన్నారావు తమకు అనుకూలంగా మలుచుకుని ఇతర అకౌంట్ల నుంచి డబ్బు పంపిస్తామని చెప్పి కొన్నాళ్లు సక్రమంగానే వ్యవహరించారు. దీంతో ఖాతాదారుల్లో సదభిప్రాయం రావడంతో డబ్బు ఇచ్చేసి వెళ్లిపోగా, పలుమార్లు ఇతర అకౌంట్లలో జమ చేయించి తమ అకౌంట్లలోకి ఉద్యోగులు బదలాయించుకున్నట్లు తెలిసింది. ఇందులో చెన్నారావు స్థానికుడు కావడంతో చాలా మందికి పరిచయాలు ఉన్న కారణంగా ప్రశాంత్‌ను డిప్యూటీ మేనేజర్‌గా పరిచయం చేసి స్వాహాకు సహకరించినట్లు సమాచారం.

ఆన్‌లైన్ బెట్టింగ్ కోసం..

బ్యాంకుల్లో ఖాతాలు తెరవడం సులువు కావటంతో దీన్ని అక్రమార్కులు ఆన్‌లైన్ బెట్టింగ్ కోసం వినియోగిస్తున్నట్లు ఓ బ్యాంకు మేనేజర్ ప్రైవేట్ సంభాషణలో చెప్పారు. ఎవరిది నిజమైన ఖాతా, ఎవరు బెట్టింగ్ కోసం వినియోగిస్తున్నారో అర్థం కావడం లేదని తెలిపారు. బెట్టింగ్‌పై గట్టి నిఘా వేసి బ్యాంకుల ద్వారా జరిగే లావాదేవీలను పరిశీలించాలని బాధితులు కోరుతున్నారు. క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ పేకాట, డిజిటల్ కరెన్సీ పేరిట అక్రమాలకు బ్యాంక్ అకౌంట్లే కీలకమవుతున్న నేపథ్యాన నిఘా పెంచాలనే చర్చ మొదలైంది. కాగా, సత్తుపల్లి యాక్సిస్ బ్యాంకులో జరిగిన అక్రమాలపై విచారణ కొనసాగుతోందని సత్తుపల్లి పట్టణ సీఐ మోహన్‌బాబు వెల్లడించారు.

ఓటు వేయడం కార్మికుల బాధ్యత

- సింగరేణి డైరెక్టర్ బలరామ్
- నేడు సింగరేణిలో 'గుర్తింపు' ఎన్నికలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో బుధవారం జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో ప్రతీ కార్మికుడు బాధ్యతగా ఓటు వేయాలని డైరెక్టర్(పా) బలరామ్ సూచించారు. కార్మికులు గుర్తింపు కార్డు తెచ్చుకోవాలని, కార్డ్ లేనివారు జీఎం కార్యాలయం నుంచి తీసుకోవాలని చెప్పారు. కాగా, అన్ని సంఘాల నాయకులు ప్రజాస్వామ్య పద్ధతిలో పోలింగ్ నిర్వహణకు సహకరించాలని కోరారు. బుధవారం ఉదయం 7నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్, రాత్రి ఏడు గంటలకు లెక్కింపు ప్రారంభమవుతుందని తెలిపారు.

పోలింగ్ కేంద్రాలివే..

సింగరేణివ్యాప్తంగా 84 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఇందులో కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలో నాలుగు, కొత్తగూడెం ఏరియా రుద్రంపూర్, సత్తుపల్లి, ఇల్లెందు ఏరియాల్లో మూడు చొప్పున, మణుగూరులో ఏడు కేంద్రాలు ఉన్నాయి. ఆయా ఏరియాల్లో 6,587 మంది కార్మికులు ఓటు వేయనున్నారు.

రామాలయంలో తగ్గని రద్దీ



భారీగా హాజరైన భక్తులు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

- బేడా మండపంలో స్వామివారికి నిత్యకల్యాణం
- రాపత్తు సేవలో గోవిందరాజస్వామిగా దర్శనం

భద్రాచలం: భద్రాచలంలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. మంగళవారం సైతం సెలవు కావడంతో భక్తులు స్వామివారి దర్శనానికి భారీగా తరలివచ్చారు. ఆలయంలో జరిగిన ఆర్జిత సేవల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బేడా మండపంలో జరిగిన నిత్యకల్యాణంలో 102 జంటలు పాల్గొన్నాయి. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

రెవెన్యూ ఆధ్వర్యంలో రాపత్తు సేవ

రామాలయంలో వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఈ ఆలయానికి అనుబంధంగా తాతగుడి సెంటర్‌లో ఉన్న గోవిందరాజ స్వామి ఆలయంలో రాపత్తు సేవ నిర్వహించారు. రామయ్యను గోవిందరాజ స్వామిగా ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో మేళతాళాలు, భజనలు, కోలాటాల నడుమ ఊరేగింపుగా రెవెన్యూ అధికారులు మండపానికి తీసుకొచ్చారు. ఇక్కడ స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, హారతి సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, విశ్రాంత ప్రధాన అర్చకులు పొడిచేటి జగన్నాధాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అలా వచ్చి.. ఇలా వెళ్తారు!

- హాస్టళ్లకు చుట్టపుచూపుగా సంక్షేమ అధికారులు
- జిల్లా కేంద్రాల నుండి డెయిలీ సర్వీస్
- విద్యార్థులను పట్టించుకోని వైనం
- ఫలితంగా సిబ్బంది ఇష్టారాజ్యం



జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతిగృహాల వివరాలు..

శాఖ	ప్రీ మెట్రిక్ వసతిగృహాలు / ఆశ్రమ పాఠశాలలు	పోస్ట్ మెట్రిక్ వసతిగృహాలు
ఎస్సీ	41	11
ఎస్టీ	18	11
బీసీ	22	11

ఖమ్మంమయూరిసెంటర్: తల్లిదండ్రులను వదిలి ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులపై పట్టింపు కరువైంది. పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన పిల్లలు వసతిగృహాల్లో ఉంటుండగా.. పిల్లల ఆలనాపాలన చూడాల్సిన వసతిగృహాల సంక్షేమ అధికారులు ఆ దిశగా దృష్టి సారించడం లేదు. విద్యార్థులకు అందుబాటులో ఉండి.. వారి సంక్షేమాన్ని పట్టించుకోవాల్సిన అధికారులు హాస్టళ్లకు చుట్టపుచూపుగా వచ్చివెళ్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఫలితంగా ఏదైనా ఘటన జరిగితే పట్టించుకునే అధికారులు అందుబాటులో లేక విద్యార్థులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

నిబంధనలా.. మాకేంటి?

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతిగృహాలు ఆయా శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. సంక్షేమ అధికారులు విధులు నిర్వర్తించే వసతిగృహానికి ఐదు కిలోమీటర్ల పరిధిలోనే నివాసం ఉండాలి. గతంలోనే ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచిజీఓ విడుదలైంది. కానీ సంక్షేమ అధికారులు ఈ నిబంధనలను పక్కన పెట్టేశారు. జిల్లా కేంద్రానికి 40–50 కిలోమీటర్లకు పైగా దూరంలో విధులు నిర్వర్తించే వారు సైతం జిల్లా కేంద్రంలోనే నివాసముంటూ డెయిలీ సర్వీసు చేస్తున్నారు. ఇక పర్యవేక్షణ చేయాల్సిన డివిజన్, జిల్లా స్థాయి అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో సంక్షేమ అధికారులకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ఫలితంగా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం, సరైన వసతి సౌకర్యాలు అందడం లేదు.


కానరాని సమయపాలన

ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల అధికారులు కచ్చితంగా సమయపాలన పాటించాలి. ప్రతిరోజు ఉదయం 6 గంటలకు వసతిగృహానికి చేరుకుని విద్యార్థులు పాఠశాలలకు వెళ్లే వరకు అంటే ఉదయం 9గంటల వరకు విధులు నిర్వర్తించాలి. సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వసతిగృహంలో ఉండాలి. ఇక సెలవు రోజుల్లో, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పెట్టని రోజుల్లో మధ్యాహ్నం 12.30 గంటల నుండి పిల్లలు భోజనం చేసే వరకు పర్యవేక్షించాలి. అంతేకాక తరచుగా పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల చదువు, పురోగతిని తెలుసుకోవాలి. కానీ ఇవన్నీ పాటించే అధికారులు మూడు శాఖల్లో కలిపి పది మంది కూడా ఉండరంటే అతిశయోక్తి కాదు. మండల కేంద్రాలు, మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్సీ, బీసీ, ఎస్టీ వసతిగృహాల సంక్షేమ అధికారులు చాలా మంది ఖమ్మంలోనే ఉంటూ సొంత పనులు చక్కబెట్టుకున్నాక మధ్యాహ్నం తర్వాతే వసతిగృహాలకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. మరికొందరు ఇతర కారణాలు చూపించి సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

సిబ్బందిదే పెత్తనం..

సంక్షేమ అధికారులు దూర ప్రాంతాల్లో నివాసం ఉంటుండడంతో వసతిగృహాల్లోని విద్యార్థుల బాధ్యత, నిర్వహణ నాలుగో తరగతి సిబ్బంది చూస్తున్నారు. కొందరు అధికారులైతే ప్రైవేట్ వ్యక్తులను నియమించినట్లు తెలుస్తోంది. అధికారి రోజులో ఒకసారి లేదంటే రెండు మూడు రోజులకోసారి వచ్చి వెళ్తుండగా.. మిగిలిన సమయమంతా వారి అనుచరులు, నాలుగో సిబ్బంది పెత్తనం చెలాయిస్తున్నారు. ఈక్రమాన తరచుగా విద్యార్థులను దండించడం, సొంత పనులు చేయిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉన్నతాధికారులు దృష్టి సారించాలి



హెడ్ క్వార్టర్‌లోనే ఉండాలని నిబంధనలు చెబుతున్నా సంక్షేమ అధికారులు పట్టించుకోవడం లేదు. సంక్షేమశాఖల జిల్లా అధికారులు వసతిగృహాల నిర్వహణ, అధికారుల విధినిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులైనా దృష్టి సారించి వార్డెన్లు అందుబాటులో ఉండేలా చూడాలి.

– వి.వెంకటేష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి

పర్యవేక్షణ కొరవడుతుంది..



వసతిగృహాల నిర్వహణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడింది. వార్డెన్లు జిల్లా కేంద్రం నుండి అప్ అండ్ డౌన్ చేస్తున్నా పట్టించుకోవడం లేదు. కొందరు వార్డెన్లు అసలు విధులకే హాజరు కావడం లేదు. దీనిపై ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారులు పట్టించుకోక వార్డెన్లు మరింత నిర్లక్ష్యం చేస్తున్నారు.

– ఇటికాల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి

క్లుప్తంగా

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన వీవీసీ సంస్థల ఎండీ రాజా


మంత్రి వెంకటరెడ్డితో రాజేంద్రప్రసాద్

ఖమ్మంఅర్బన్: 'ప్రజాపాలన' జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంగళవారం ఖమ్మం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన్ను వీవీసీ గ్రూప్ సంస్థల ఎండీ వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ (రాజా) కలిశారు. మర్యాదపూర్వకంగా మంత్రిని కలిసిన ఆయన శాలువాతో సన్మానించారు.

జాతీయస్థాయి కరాటే టోర్నీకి ఎంపిక


జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఖమ్మంస్పోర్ట్స్: జూనియర్ కళాశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన ఇటీవల సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-19 కరాటే పోటీల్లో ఖమ్మం క్రీడాకారులు సత్తా చాటి జాతీయస్థాయి జట్టులో స్థానం సాధించారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి పోటీలకు గోపతి విఘ్నేశ్, గోపతి గణేశ్, బి.నితిన్, యు.సుదర్శన్, ఎస్‌కే ఖదీర్, కె.సాయిచరణ్ ఎంపికయ్యారు. క్రీడాకారులను క్రీడల సంఘం కార్యదర్శి ఎండీ మూసాకలీం, కరాటే మాస్టర్ గోపతి సైదులు అభినందించారు.

నటిస్తూ.. ఫోన్ల చోరీ

సత్తుపల్లి: అరవై ఆరు కళల్లో చోరకళ ఒకటని చెబుతారు. ఇదే వంట పట్టించుకున్న కొందరు ఆగంతకులు ప్రజలను బురిడీ కొట్టిస్తూ సెల్‌ఫోన్ల చోరీకి పాల్పడుతున్నారు. వీరిలో ఒకరు ద్విచక్రవాహనంపై వెళ్తూ కిందపడుతున్నట్టు ఒరిగిపోతారు. దీంతో ఎవరైనా సాయం చేయడానికి వచ్చి.. పడిపోతున్న వ్యక్తిని లేపుదామని భావిస్తూ అంతలోనే మరో వ్యక్తి దూరం నుంచి వచ్చి తెలియకుండానే షర్ట్ జేబులోని సెల్‌ఫోన్ చోరీ చేస్తున్నారు. ఈతరహా దొంగతనాలు సత్తుపల్లిలో ఇటీవల వరుసగా ఐదారు జరగడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకరిద్దరు ముఠాగా ఏర్పడి ఈ దొంగతనాలు చేస్తున్నట్లు సమాచారం. పలుప్రాంతాల్లో నిందితుల చిత్రాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయినా స్పష్టత లేకపోవడంతో ఆచూకీ తెలియరావడం లేదు. ఈమేరకు దీనిపై పోలీసులు నిఘా ఏర్పాటు చేసి విచారణ ముమ్మరం చేశారు.

గుండెపోటుతో తహసీల్ అటెండర్ మృతి


షేక్ బుడన్‌సాహెబ్ (ఫైల్)

బోనకల్: తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న గోవిందాపురం (ఏ) గ్రామానికి చెందిన షేక్ బుడన్‌సాహెబ్(52) గుండెపోటుతో మంగళవారం మృతి చెందాడు. ఆయన ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. గోవిందాపురం(ఏ) వీఆర్ఏగా ఏళ్ల పాటు పనిచేసిన ఆయనను ఆ వ్యవస్థ రద్దయ్యాక అటెండర్‌గా నియమితులయ్యాడు. ఈక్రమంలోనే మంగళవారం విధులకు బయలుదేరిన ఆయనకు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు సమాచారం అందుకున్న సర్పంచ్ భాగం శ్రీనివాసరావు, మోటయ్రి సొసైటీ ఉపాధ్యక్షుడు కావూరి శంకర్‌రావుతోపాటు కోటేశ్వరావు, భాగం నాగేశ్వరావు తదితరులు మృతదేహం వద్ద నివాళులర్పించారు.

చికిత్స పొందుతున్న రైతు మృతి

సత్తుపల్లిరూరల్: పొలంలో పురుగుల మందు పిచికారీ సందర్భంగా అస్వస్థతకు గురైన రైతు హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సత్తుపల్లి పట్టణ సీఐ మోహన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లి మండలం రేజర్లకు చెందిన చింతల పుల్లారెడ్డి(53) తన చేనులో ఈనెల 23న పురుగుల మందు పిచికారీ చేయిస్తుండగా పీల్చుకుని తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో సత్తుపల్లిలో ప్రాథమిక చికిత్స చేయించాక హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయన మృతి చెందాడు. పుల్లారెడ్డికి భార్య, పిల్లలు ఉన్నారు.

పాల్వంచలో సుతారీ మేస్త్రీ..

పాల్వంచ: రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పాల్వంచ ఇందిరానగర్ కాలనీకి చెందిన సుతారి మేస్త్రీ కంటె నర్సింహారావు(42) ఈనెల 22వ తేదీన నర్సింహమూర్తి మోటార్ సైకిల్‌పై సూరారంలో జరిగే అయ్యప్ప ఇరుముడికి బయలుదేరాడు. మార్గ మధ్యలో పాండురంగాపురానికి చెందిన మాలోతు నవీన్ అతివేగంగా మోటార్ సైకిల్‌పై వచ్చి వీరిని ఢీకొట్టాడు. దీంతో నర్సింహమూర్తికి స్వల్పగాయాలు కాగా నర్సింహారావు తలకు తీవ్రగాయమైంది. ఆయను ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తల్లి సుగుణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు.

కొనలేం... తినలేం

- తుపాన్‌తో దెబ్బతిన్న కూరగాయల తోటలు
- ఉమ్మడి ఖమ్మంతో పాటు ఏపీలోని పలు జిల్లాల్లో ప్రభావం
- ఫలితంగా అందుబాటులో లేని కూరగాయలు
- ఇతర చోట్ల నుంచి దిగుమతితో మండిపోతున్న ధరలు
- బెంబేలెత్తిపోతున్న సాధారణ, మధ్యతరగతి ప్రజలు


మధిర మార్కెట్‌లో కూరగాయలు

మధిర: కూరగాయల ధరలు ఇటీవల భారీగా పెరిగాయి. మిచాంగ్ తుపాన్ ప్రభావంతో కురిసిన అకాల వర్షాల కారణంగా కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే కాక సరిహద్దున ఉన్న ఏపీలోని పలు జిల్లాల్లోనూ తుపాన్ ప్రభావం చూపింది. దీంతో తోటలు దెబ్బతినగా లభ్యత తగ్గి ధరలు పెరిగిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు. ఖమ్మం జిల్లా మార్కెట్లకు జిల్లాతో పాటు విజయవాడ నుంచి కూరగాయలు దిగుమతి అవుతాయి. కానీ పంటలు కోల్పోవడంతో దిగుమతి తగ్గి ధరలపై ప్రభావం చూపుతోంది.

మిగిలిన వాటికి తెగుళ్లు

గత ఇరవై రోజులుగా పొగమంచు దట్టంగా ఉంటోంది. దీంతో బెండ, దొండ, దోసకాయల దిగుబడి తగ్గి, బీరకు తెగుళ్లు ఆశిస్తున్నాయి. అటు తుపాన్, ఇటు తెగుళ్ల ప్రభావంతో దిగుబడులు పడిపోగా మార్కెట్‌కు అంతంత మాత్రంగానే కూరగాయలు వస్తున్నాయి. ఫలితంగా ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలను దిగుమతి చేసుకుంటుండడంతో ధరలు పెరిగినట్లు తెలుస్తోంది.

అన్నీ అంతే...

గతంలో కేజీ రూ.20 ధర పలికిన కూరగాయలు అమాంతం పెరిగాయి. రైతు బజార్‌లో టమాటా కేజీ రూ.40 ఉండగా బయట మార్కెట్‌లో మరో రూ.10 అదనంగా తీసుకుంటున్నారు. సాధారణంగా ఏటా ఈ సమయాన టమాటా కేజీ రూ.10 నుంచి రూ.15 వరకు విక్రయిస్తారు. కానీ వర్షాలతో తోటలు కోల్పోవడంతో లభ్యత లేదు. మధిర మున్సిపాలిటీ పరిధిలోని అంబారుపేటలో ఏటా పెద్దసంఖ్యలో రైతులు టమాటా సాగు చేస్తుండగా ఈసారి ఇద్దరు, ముగ్గురి తోగలు మాత్రమే మిగిలాయి. రైతు బజార్‌లో ఉల్లిగడ్డ ధర కేజీ రూ.40 ఉండగా, సాధారణ మార్కెట్‌లో రూ.50 వరకు పలుకుతోంది. ప్రతీ కూరలో ఉల్లిగడ్డలు తప్పనిసరి కావడంతో ధర ఎక్కువైనా కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అలాగే, బంగాళదుంప ధర కేజీ రూ.20 దాటిన సందర్భాలు లేవు. కానీ ఇప్పుడు రూ.40 వరకు ధర పలుకుతోంది. ఓవైపు కూరగాయల ధరలు పెరిగి సామాన్య ప్రజలను చిన్నాభిన్నం చేస్తుండగా ఉల్లిగడ్డలు, ఆలుగడ్డలు ధరలు సైతం ఆకాశాన్ని అంటుతుండడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

కూరగాయల్లో కొన్నింటి ధరలు (కేజీకి రూ.ల్లో)

కూరగాయలు	తుపాన్‌కు ముందు	తుపాన్ తర్వాత
బెండకాయ	30	70
దొండకాయ	30	80
టమాట	15	40
బీరకాయ	40	70
వంకాయ	30	60
సొరకాయ	15	40
దోసకాయ	25	50
కాకరకాయ	40	70
బంగాళదుంపలు	20	40
క్యారెట్	50	70
మిర్చి	40	70
చిక్కుడు	50	120

కొనేటట్టు లేదు



ఏ కూరగాయలు కొనేటట్టు లేదు. అన్నింటి ధరలు మండిపోతున్నాయి. కూలి పనులకు వెళ్తే వచ్చే డబ్బులో సగం కూరగాయలకే ఖర్చు పెట్టాల్సి వస్తోంది. సామాన్యులకు అందనంతస్థాయిలో కూరగాయల ధరలు ఉండడం వల్ల ఆర్థికంగా మరింత నష్టపోతున్నాం.

– సీహెచ్ ఆదిలక్ష్మి, కూలి, మధిర

ధరలు మండుతున్నాయి



కూరగాయల ధరలు మండుతున్నాయి. ఉల్లిపాయలు కోయకముందే కన్నీరు వస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు ముందు రేట్లు తక్కువగానే ఉండేవి. తుపాన్ తర్వాత అన్నింటి ధరలు విపరీతంగా పెరిగాయి. వర్షాలతో పంటలు పోవడమే ఇందుకు కారణమని చెబుతున్నారు.

– కె.స్వప్న, గృహిణి, సిద్ధినేనిగూడెం

తుపాన్ ప్రభావంతోనే...



తుపాన్ ప్రభావంతో కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. చేతికొచ్చే దశలో ఉన్న తోటలు వర్షాల వల్ల ఆగమైపోయాయి. దీంతో దిగుబడి గణనీయంగా పడిపోయింది. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడంతో కూరగాయలకు డిమాండ్ పెరిగింది.

– ఎస్.శ్రీనివాసరావు, కూరగాయల వ్యాపారి, మధిర

కమ్యూనిస్టుల పురోగమనం అనివార్యం

సీపీఐ ఆవిర్భావ దినోత్సవంలో జాతీయ సమితి సభ్యుడు హేమంతరావు


సీపీఐ పతాకాన్ని ఎగురవేస్తున్న పువ్వాడ నాగేశ్వరరావు, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: దేశంలో కమ్యూనిస్టుల అవసరం పెరుగుతోందని.. కులం, మతం రాజకీయ అంశాలుగా మారి డబ్బు ప్రభావితం చేస్తున్న నేపథ్యాన కమ్యూనిస్టులు పురోగమించడం అనివార్యంగా మారిందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. స్వాతంత్ర్యానికి ముందు, స్వాతంత్ర్యం వచ్చాక కమ్యూనిస్టు పార్టీ చేసిన పోరాటాలు, సాధించిన హక్కులు మరిచిపోలేనివని చెప్పారు. సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాలు నిర్వహించిందని, అందులో సాయుధ తెలంగాణ పోరాటం ఒకటని తెలిపారు. చట్టసభల ద్వారా రైతుల, వ్యవసాయ కార్మికులకు సంబంధించి అనేక హక్కులను సాధించిందని గుర్తు చేశారు. కాగా, రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా ప్రజల హక్కులను హరించాలని చూస్తున్న బీజేపీపై అన్నివర్గాలు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యకర్యక్రమంలో నాయకులు దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్.కే. జానీమియా, సిద్దినేని కర్ణకుమార్, క్లెమెంట్, మహ్మద్ సలాం, తాటి వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, తాటి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం గాయకులకు పురస్కారాలు



వీవీ.రెడ్డి, మాలతికి అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరానికి చెందిన ఇద్దరు గాయకులకు స్ఫూర్తి శిఖరం పురస్కారాలు దక్కాయి. ఆర్వాణి సకల కళావేదిక, సంగమేశ్వర సాంస్కృతిక సంస్థ సంయుక్త ఆధ్వర్యాన సోమవారం రాత్రి కరీంనగర్ ఫిలింభవన్‌లో వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కళాకారులకు అవార్డులు అందజేశారు. ఇందులో ఖమ్మంకు చెందిన గాయకులు వీవీ.రెడ్డి, మాలతికి స్ఫూర్తి శిఖరం అవార్డులతో పాటు 2023 సంవత్సరానికి గాను జాతీయ పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు డి.శ్రీధర్‌తో పాటు దీక్షితుల సుబ్రమణ్యం, ఇసనపల్లి నగేష్ పాల్గొనగా, గాయకులను పలువురు అభినందించారు.

'ప్రజాపాలన'కు గైర్హాజరు


వేదిక ముందు వరుసలో ఖాళీగా ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేల సీట్లు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రజాపాలనపై మంగళవారం ఖమ్మం కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్న ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని చాలా మంది ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు హాజరుకాగా.. చివరిలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి వచ్చారు. ఖమ్మం, పాలేరు ఎమ్మెల్యేలు మంత్రుల హోదాలో పాల్గొనగా, మధిర ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. ఇక మిగతా ఐదుగురు ఎమ్మెల్యేలు సమావేశంలో కనిపించలేదు. దీంతో ఎమ్మెల్యేలు, ఎంపీలకు సమాచారం ఇచ్చారా, లేదా అని చర్చించుకోవడం వినిపించింది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

'ప్రజాపాలన'కు ప్రత్యేక అధికారులు

నేలకొండపల్లి: రాష్ట్రప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ఈనెల 28నుంచి ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించనుంది. ఇందుకోసం నియోజకవర్గ, మండల స్థాయిలో ప్రత్యేకాధికారులను నియమిస్తూ కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా అధికారులు గ్రామసభల నిర్వహణ సాఫీగా జరిగేలా పర్యవేక్షిస్తూ దరఖాస్తుల పరిశీలన, ఆన్‌లైన్‌లో నమోదుపై దృష్టి సారించాల్సి ఉంటుంది.

ప్రత్యేకాధికారులు వీరే..

నియోజకవర్గ స్థాయిలో నియమించిన ప్రత్యేకాధికారుల వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం నియోజకవర్గానికి కేఎంసీ కమిషనర్ ఆదర్శ సురభి, పాలేరుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యు.రాజేశ్వరి, మధిరకు ఖమ్మం ఆర్‌డీఓ జి.గణేష్, వైరాకు అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, సత్తుపల్లికి కల్లూరు ఆర్‌డీఓ ఎస్.అశోక్‌చక్రవర్తిని నియమించారు. మండలాల వారీగా ఖమ్మం అర్బన్‌కు డీఈఓ సోమశేఖరశర్మ, కూసుమంచికి డీఎస్ఓ జి.శ్రీలత, కొణిజర్లకు డీడబ్ల్యూఓ టి.సుమ, సత్తుపల్లికి డీవైఎస్ఓ టి.సునీల్‌రెడ్డి, బోనకల్‌కు కార్మిక శాఖ అధికారి సీహెచ్.వెంగమాంబ, ముదిగొండకు ట్రైబల్ వెల్ఫేర్ అధికారి ఎన్.విజయలక్ష్మి, పెనుబల్లికి సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ డి.శ్రీనివాసులు, వేంసూరు మండలానికి ఆడిట్ అధికారి షేక్ హుస్సేన్‌ను ప్రత్యేక అధికారిగా నియమించారు. అలాగే, చింతకాని మండలానికి ఏడీఏ ఎం.సతీష్, ఏన్కూరుకు మైనింగ్ ఏడీ జి.సంజయ్‌కుమార్, కల్లూరుకు మార్క్‌ఫెడ్ డీఎం పి.సునీత, కామేపల్లికి డీఐఈఓ కె.రవిబాబు, ఖమ్మం రూరల్ మండలానికి బీసీ వెల్ఫేర్ అధికారి జ్యోతి, మధిరకు సీపీఓ శ్రీనివాస్, నేలకొండపల్లికి ఎంప్లాయిమెంట్ అధికారి కె.శ్రీరామ్, రఘునాథపాలెంకు డీసీఓ కె.విజయకుమారి ప్రత్యేక అధికారిగా నియమితులయ్యారు. తల్లాడ మండలానికి ఫిషరీస్ ఏడీ ఆంజనేయులు, తిరుమలాయపాలెంకు డీపీఓ ఎం.విజయనిర్మల, వైరాకు ఎస్సీ డీడీ కె.సత్యనారాయణ, ఎర్రుపాలెం మండలానికి పశుసంవర్ధక శాఖ అధికారి బి.వేణుమనోహర్‌ను ప్రత్యేక అధికారిగా నియమించారు.

మహిళను దుర్భాషలాడిన వ్యక్తిపై కేసు

కారేపల్లి: అకారణంగా మహిళను దుర్భాషలాడిన వ్యక్తిపై కారేపల్లి పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. మండలంలోని పాటిమీదిగుంపు గ్రామానికి చెందిన వివాహిత ధరావత్ కమలతెట అదే గ్రామానికి చెందిన ధరావత్ మంగూ అసభ్యంగా ప్రవర్తించడమేకాక దుర్భాషలాడాడు. అలాగే, ఆమె దాడికి యత్నించాడు. దీంతో కమల ఇచ్చిన ఫిర్యాదుతో ఆయనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామారావు తెలిపారు.

నెహ్రూ కప్ క్రికెట్ పోటీలు ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రాజాశ్రీకృష్ణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నెహ్రూ కప్ రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ మంగళవారం ప్రారంభమైంది. ఈ పోటీలను ప్రవాస భారతీయుడు డాక్టర్ తాళ్లూరి రాజా శ్రీకృష్ణ లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తి మాత్రమే ప్రధానమని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో 28 ఏళ్లుగా రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. భద్రాద్రి ఖ్యాతిని పెంచేలా నిర్వహిస్తున్న ఈ టోర్నీకి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. తొలి రోజు జర్నలిస్టులు – శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం జట్ల నడుమ ఫ్రెండ్లీ మ్యాచ్ నిర్వహించగా ఆలయ జట్టు గెలుపొందింది. కార్యక్రమంలో పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ వరలక్ష్మితో పాటు చెంగల్‌రావు, వాతాడి దుర్గాఅశోక్, తోటమళ్ల బాలయోగి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉద్యోగి మృతి

మృతదేహంతో ఆందోళన


మృతదేహంతో ఆందోళన నిర్వహిస్తున్న బంధువులు

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం (కె) మండలంలోని కొండాపురం సమీపాన మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ప్రభుత్వ ఉద్యోగి మృతి చెందాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం సీ–కొత్తూరుకు చెందిన సోడి శ్రీనివాస్ (50) భద్రాచలం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. పని నిమిత్తం సోమవారం వచ్చిన ఆయన కొండాపురం సమీపాన బస్సు దిగి నడిచి వెళ్తున్నారు. ఈ క్రమంలో చర్ల వైపు నుంచి వస్తున్న బొలెరో ఢీకొనగా, తీవ్ర గాయాల పాలైన శ్రీనివాస్‌ను భద్రాచలంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందగా, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెంకటాపురం ఎస్ఐ అశోక్ తెలిపారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి..

చర్ల: వెంకటాపురం మండలంలోని కొండాపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రెవెన్యూ ఉద్యోగి సోడి శ్రీనివాసరావు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతుడి కుటుంబ సభ్యులు మంగళవారం చర్లలోని గాంధీసెంటర్‌లోని కూరగాయల దుకాణం ఎదుట ఆందోళన నిర్వహించారు. సమాచారం అందుకున్న సీఐ బి.రాజగోపాల్ అక్కడకు చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మృతదేహంతో ఇక్కడ ఆందోళన నిర్వహించడం సరికాదని, ప్రమాదం వెంకటాపురం మండలంలో జరగడం వల్ల అక్కడ పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణమైన వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి వచ్చే బెనిఫిట్స్ అన్నీ బాధిత కుటుంబానికి వస్తాయని, ఆందోళన విరమించాలని సీఐ సూచించడంతో వారు ఆందోళన విరమించారు.

చికిత్స పొందుతున్న న్యాయవాది మృతి

ఖమ్మంఅర్బన్: ఖమ్మం గొల్లగూడెం రోడ్డు హనుమాన్‌నగర్‌లోని అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న జూనియర్ న్యాయవాది వి.స్వప్న(36) పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం చిన్నగొల్లగూడెంనకు చెందిన స్వప్న ఎనిమిదేళ్లుగా ఖమ్మంలో ఉంటూ ఒక న్యాయవాది వద్ద జూనియర్‌గా పనిచేస్తోంది. కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఆమె ఈ నెల 23న తన ఫ్లాట్‌లో పురుగులమందు తాగింది. ఈ విషయాన్ని ఆమె మరో న్యాయవాదికి ఫోన్ ద్వారా తెలపగా వారు చేరుకుని ఆస్పత్రిలో చేర్పించారు. ఆ తర్వాత పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఘటనపై మృతురాలి తండ్రి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

దాడి ఘటనలో రిమాండ్

కారేపల్లి: కుటుంబ కలహాల నేపథ్యాన ఒకరిపై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రామారావు తెలిపారు. కారేపల్లి మండలం పేరుపల్లికి చెందిన కేలోత్ శ్రీనివాస్‌కు కొద్దినెలల క్రితం వివాహం జరగగా భార్యతో మనస్పర్థల కారణంగా దూరం ఉంటున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పోలంపల్లికి చెందిన బోడా అశోక్, కారేపల్లికి చెందిన కల్యాణ్, వినయ్‌కుమార్ సోమవారం శ్రీనివాస్ సోదరుడైన కేలోత్ హేమ్లా, ఆయన మిత్రుడు బుగ్గ సతీష్‌పై కత్తితో దాడిచేశారు. ఘటనలో గాయపడిన హేమ్లా మేనమామ ఫిర్యాదుతో హత్యాయత్నం కేసు నమోదు చేయగా, మంగళవారం నిందితులు ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

పువ్వాడనగర్‌లో తవ్వకాల కలకలం

రఘునాథపాలెం: మండలంలోని పువ్వాడనగర్‌లో విగ్రహం పేరిట మంగళవారం తెల్లవారుజామున చేపట్టిన తవ్వకాలపై కలకలం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పువ్వాడనగర్‌లోని డబుల్‌బెడ్‌రూం సముదాయం ఎదురుగా నివాసాలు పక్కన పురాతన దేవతా విగ్రహం ఉందంటూ స్వామి తనకు కలలో చెప్పారంటూ కోయచలకకు చెందిన ఓ వ్యక్తి తవ్వకం చేపట్టారు. అక్కడ ఓ విగ్రహాన్ని వెలికితీసి స్థానికులతో కలిసి పూజలు చేస్తున్నారు. దీనిపై స్థానికంగా కొందరు అభ్యంతరం వ్యక్తం చేయడంతో వివాదం నెలకొంది. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు కోయచలక వ్యక్తిని పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. ఈ ఘటనపై ఓ మహిళ ఫిర్యాదు చేసినా, ప్రాథమిక విచారణ పూర్తి కాకపోవడంతో కేసు నమోదు చేయలేదని రఘునాథపాలెం సీఐ శ్రీధర్ తెలిపారు.

లారీ - ద్విచక్రవాహనం ఢీ : ఒకరు మృతి

కొణిజర్ల: ద్విచక్రవాహనాన్ని వెనక నుంచి కంటైనర్ లారీ ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కొణిజర్ల ఎస్ఐ జె.శంకరరావు తెలిపిన వివరాల ప్రకారం ... తల్లాడ మండల కేంద్రానికి చెందిన ములగలపాటి విజయ్‌కుమార్(38) ఖమ్మం నుంచి ద్విచక్రవాహనంపై బియ్యం టిక్కీతో తల్లాడకు వెళ్తుండగా కొణిజర్ల సెంటర్‌లో వెనక నుంచి వస్తున్న కంటైనర్ లారీ ఢీకొట్టింది. లారీ వెనక టైర్ ఆయన మీదకు ఎక్కడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. విజయ్‌కుమార్‌కు ఇంకా వివాహం కాకపోగా, ఆయన తండ్రి, ఆర్ఎంపీ సత్యనారాయణ మృతి చెందగా తల్లి మాత్రమే ఉంది. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ వారి సహకారంతో ఖమ్మం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కరుణగిరి వద్ద ప్రమాదంలో యువకుడు...

ఖమ్మంరూరల్: మండలంలోని కరుణగిరి వద్ద గుర్తుతెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి పల్లెగూడెంకు చెందిన ద్విచక్రవాహనదారుడు కొట్టె గణేష్(19) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గణేష్ మరో యువకుడితో కలిసి ద్విచక్రవాహనంపై మంగళవారం ఖమ్మం వెళ్తున్నాడు. మార్గమధ్యలో కరుణగిరి వద్ద వెనుక నుండి వచ్చిన గుర్తుతెలియని వాహనం వీరిని బలంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై గణేష్ మృతి చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన ట్రైనీఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు.



పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టంలో ఈనాడు ప్రతులను దగ్ధం చేస్తున్న వలంటీర్లు

వలంటీర్ల సమ్మె అవాస్తవం

- సమ్మె ప్రచారాన్ని ఖండించిన వలంటీర్ల సంఘాలు

సాక్షి, అమరావతి/చిత్తూరు కలెక్టరేట్/పటమట (విజయవాడ తూర్పు)/వీరఘట్టం: నిన్న మొన్నటి దాకా వలంటీర్లను సంఘ విద్రోహశక్తులుగా చిత్రీకరించిన విపక్ష పార్టీలు, వారి అనుకూల పచ్చ మీడియా ఇప్పుడు వలంటీర్లలో కొందరినైనా చీల్చి వారిలో ప్రభుత్వ విద్వేషాన్ని రగిల్చి సమ్మెబాట పట్టించాలన్న కుట్రలు పటాపంచలయ్యాయి. తామెలాంటి సమ్మెలో పాల్గొనడంలేదని వలంటీర్ల సంఘాలు తేల్చిచెప్పాయి. రాష్ట్రంలో మొత్తం 2.60 లక్షల మంది వలంటీర్లు పనిచేస్తుండగా.. ఆయా వలంటీర్లు తమ వృత్తి సంబంధిత అంశాలపై తలెత్తే సందేహాలు నివృత్తి చేసుకునేందుకు జిల్లాల వారీగా లేదా ఎక్కడికక్కడ అనధికారికంగా సోషల్ మీడియా గ్రూపులు ఏర్పాటుచేసుకున్నారు. కొన్నింటిలో ఎవరికి వారే ఆ గ్రూపుల్లో చేరే అవకాశం ఉండడంతో.. వివిధ ప్రతిపక్ష పార్టీల సానుభూతిపరులు కొందరు వలంటీర్ల ముసుగులో ఆ గ్రూపుల్లోకి దూరి వలంటీర్లను రెచ్చగొట్టాలన్న లక్ష్యంతో ప్రభుత్వంపై రెచ్చగొట్టే పోస్టులు పెడుతూ వచ్చారని వలంటీర్లు చెప్పారు. నిజానికి.. వలంటీర్లకుగానీ, వలంటీర్ల సంఘాల ప్రతినిధులకు గానీ సమ్మె చేయాలని ఎలాంటి ఆలోచన లేకపోయినా ప్రేరేపిత పోస్టులకు స్పందించే ఇద్దరు ముగ్గురు వ్యక్తులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్లు సమ్మెకు దిగుతున్నారని మిగిలిన వలంటీర్లను రెచ్చగొట్టి వారితో సమ్మె ముసుగులో ఆందోళన చేపట్టేందుకు తెలుగుదేశం సహా మరికొన్ని రాజకీయ పక్షాలు యత్నిస్తున్నాయి. అయితే, వలంటీర్ల సమ్మెను గ్రామ, వార్డు సచివాలయాల శాఖ అధికారులు కొట్టిపారేశారు. రాష్ట్రంలో వలంటీర్లు ఎక్కడా విధులు బహిష్కరించినట్లుగానీ, ఆందోళనలు చేపట్టినట్లుగానీ ఎలాంటి సమాచారంలేదని వారు పేర్కొంటున్నారు. ఇక.. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన 'ఆడుదాం ఆంధ్రా'కార్యక్రమంలో వలంటీర్లు పూర్తిస్థాయిలో పాల్గొన్నారని వారు స్పష్టంచేశారు. చంద్రబాబుకు లబ్ధి చేకూర్చాలన్న దురుద్దేశంతో ఈనాడులో ప్రచురించిన తప్పుడు కథనంపై వలంటీర్లు మండిపడ్డారు. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలంలోని సీపీఎస్ రోడ్డులో మంగళవారం ఈనాడు ప్రతులతో ఆందోళన చేశారు. రామోజీరావు డౌన్‌డౌన్ అంటూ నినదిస్తూ ఈనాడు ప్రతులను దగ్ధంచేశారు.

ఆటలతో.. ఆరోగ్యం.. ఆణిముత్యాలు

గ్రామీణ యువ క్రీడాకారుల ప్రతిభను సానపట్టి దేశానికి అందిస్తాం: సీఎం జగన్

- ప్రతి ఒక్కరికీ వ్యాయామం ఎంత అవసరమో అవగాహన కల్పిస్తాం
- ఇక ఏటా 'ఆడుదాం.. ఆంధ్ర' టోర్నీ
- మెగా టోర్నీని గుంటూరులో ప్రారంభించిన ముఖ్యమంత్రి



గుంటూరు జిల్లా నల్లపాడులో జ్యోతి ప్రజ్వలన చేసి 'ఆడుదాం ఆంధ్ర'ను ప్రారంభిస్తున్న సీఎం జగన్. చిత్రంలో మంత్రి రోజా, బ్యాడ్మింటన్ ప్లేయర్ కిడాంబి శ్రీకాంత్ తదితరులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: 'ఆడుదాం ఆంధ్ర'ఆటల పోటీల ద్వారా గ్రామీణ ఆణిముత్యాలను వెలికితీసి సానపట్టి వజ్రాలుగా మార్చి దేశానికి అందిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. దేశంలోనే అతిపెద్ద మెగా టోర్నీ 'ఆడుదాం ఆంధ్ర'ను మంగళవారం గుంటూరు జిల్లా నల్లపాడులోని లయోలా పబ్లిక్ స్కూల్‌లో సీఎం జగన్ లాంఛనంగా ప్రారంభించారు. క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేశారు. ఇవాళ మొదలవుతున్న ఈ క్రీడా సంబరాలు దేశ చరిత్రలోనే మైలురాయిగా నిలుస్తాయని, 47 రోజుల పాటు ఫిబ్రవరి 10వతేదీ దాకా ఊరూరా పండుగ వాతావరణంలో వీటిని నిర్వహిస్తామని చెప్పారు. అందరూ పాల్గొనే ఒక గొప్ప పండుగగా ఇది చరిత్రలో నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ ఇంకా ఏమన్నారంటే..

రెండు ప్రధాన లక్ష్యాలు..

'ఆడుదాం.. ఆంధ్ర'కార్యక్రమం వెనుక ప్రభుత్వానికి రెండు ప్రధాన ఉద్దేశాలున్నాయి. ఒకటి.. గ్రామస్థాయిలోని ఆణిముత్యాలను వెలికితీసి ప్రపంచానికి పరిచయం చేయడం. రెండోది.. వ్యాయామం, క్రీడల వల్ల అనారోగ్య సమస్యలను దూరం చేయవచ్చు. ఇవి రెండూ సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వ్యాయామం, క్రీడల వల్ల ప్రతి మనిషికి ఆరోగ్యపరంగా ఎంత మేలు జరుగుతుంది? ప్రతి ఒక్కరికీ అవి ఎంత అవసరం? అనే విషయాలను తెలియజేసేందుకు ఇది ఒక అవగాహన కార్యక్రమంలా ఉపయోగపడుతుంది. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల బీపీ కంట్రోల్‌లో ఉంచుకోగలుగుతాం. టైప్ 2 డయాబెటీస్‌ని నిరోధించడంలో క్రీడలు చురుకైన పాత్ర పోషిస్తాయి.

మెంటార్లుగా పీవీ సింధు, శ్రీకాంత్

ఈ క్రీడోత్సవాలు సచివాలయం స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు జరుగుతాయి. వివిధ స్థాయిల్లో ఆణిముత్యాలను గుర్తించేందుకు ప్రొఫెషనల్ లీగ్ టీమ్స్ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేస్తాయి. క్రికెట్‌కు సంబంధించి చెన్నై సూపర్ కింగ్స్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ముందుకు వచ్చాయి. ఆణిముత్యాలను వెతికి వారికి మెరుగులు దిద్ది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోకి తీసుకెళ్లేందుకు ఈ టీమ్స్ తోడుగా ఉంటాయి. బ్యాడ్మింటన్‌కు సంబంధించి కిడాంబి శ్రీకాంత్, పీవీ సింధు ఇందులో భాగస్వాములు అవుతున్నారు. అంతర్జాతీయ క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా వారిలో ఒకరికి విశాఖపట్నంలో, మరొకరికి తిరుపతిలో స్థలం ఇచ్చాం. బ్యాడ్మింటన్ అకాడమీలు స్థాపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా వారికి సహకరిస్తుంది. శ్రీకాంత్, సింధు మెంటార్లుగా వ్యవహరిస్తూ ప్రతిభ ప్రదర్శించే మన పిల్లలకు తోడుగా నిలుస్తారు.

+ ఇక ఏటా ఆటలు..

ఆడుదాం ఆంధ్ర టోర్నీని ప్రతి సంవత్సరం నిర్వహిస్తాం. గ్రామస్థాయి నుంచి మొదలై మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు పోటీలు జరుగుతాయి. ఏటా ఈ కార్యక్రమం జరుగుతున్నప్పుడు గ్రామాల్లో ఆరోగ్యపరమైన అవగాహన కల్పిస్తూ టాలెంట్ హంట్ కొనసాగిస్తాం. తద్వారా మరిన్ని ఆణిముత్యాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుంది. సచివాలయ స్థాయి, మండల స్థాయి నుంచి గెలిచిన వారికి నియోజకవర్గ స్థాయిలో ఆడేందుకు ప్రొఫెషనల్ కిట్లు పంపిణీ జరుగుతుంది. ఏటా కిట్లు ఇస్తూ మన పిల్లలను ప్రోత్సహించే కార్యక్రమాన్ని నిర్వహిస్తాం.



వేడుకగా 'ఆట'

జెండా ఆవిష్కరించి ప్రారంభించిన సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దేశంలోనే అతి పెద్ద మెగా టోర్నీ 'ఆడుదాం ఆంధ్ర'గుంటూరు శివారు నల్లపాడులోని లయోలా పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. జెండాను ఆవిష్కరించి పోటీలను లాంఛనంగా ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడోత్సవాల ప్రారంభ సూచకంగా గాల్లోకి బెలూన్లను ఎగురవేశారు. అనంతరం బ్యాడ్మింటన్ క్రీడాకారుడు క్రీడాకారిణి సీహెచ్ రమాదేవికి క్రీడల టార్చ్ అందచేశారు. కిడాంబి శ్రీకాంత్‌తో కలసి క్రీడాజ్యోతిని వెలిగించారు. అనంతరం సీఎం జగన్ స్వయంగా మైదానాల వద్దకు వెళ్లి ఖోఖో, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అక్కడ ముఖ్యమంత్రి జగన్ కొద్దిసేపు క్రికెట్ బ్యాటింగ్ చేశారు. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి బౌలింగ్ చేయగా మంత్రి రోజా వికెట్ కీపింగ్ చేశారు. సీఎం జగన్ మంచి షాట్లు బాది అందరినీ ఉత్సాహపరిచారు. మంత్రి రోజాకు క్రికెట్ మెళకువలు సూచించారు. అంతకు ముందు పలు క్రీడలకు సంబంధించిన కిట్లను క్రీడాకారులకు అందచేశారు. క్రికెట్ కిట్‌లు, వాలీబాల్, బ్యాడ్మింటన్ కిట్లు అందించారు. రాష్ట్రవ్యాప్తంగా 5.09లక్షల స్పోర్ట్స్ కిట్స్ అందిస్తున్నట్లు తెలిపారు.

టీటీడీ ఉద్యోగులపై వరాల జల్లు

- పోటు కార్మికులకు వేతనం మరో రూ.పదివేలు పెంపు
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి వెల్లడి



గోవింద కోటి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టీటీడీ బోర్డు సభ్యులు

తిరుమల: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం టీటీడీ ఉద్యోగులపై వరాల జల్లు కురిపించనుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు టీటీడీ చైర్మన్, ధర్మకర్తల మండలి అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్య నిర్ణయాలు ఇవీ..

- టీటీడీ ఉద్యోగులకు సంబంధించి మొదటి దఫా డిసెంబరు 28న 3,518 మందికి, రెండో దఫా జనవరి మొదటి వారంలో 1,500 మందికి ఇళ్ల స్థలాల పంపిణీ
- ఇళ్లస్థలాలను ప్రభుత్వం నుంచి టీటీడీ కొనుగోలు చేసి అభివృద్ధి చేసి ఉద్యోగులకు అందిస్తుంది. ఈ మొత్తాన్ని ఉద్యోగులు తిరిగి టీటీడీకి చెల్లిస్తారు
- శ్రీవారి పోటు కార్మికులకు మరో రూ.10 వేల వేతనం పెంచాలని నిర్ణయం
- టీటీడీలోని పలు విభాగాల్లో వర్క్ కాంట్రాక్టు పద్ధతిలో సేవలందిస్తున్న కార్మికులకు వేతనాలు పెంపు.
- ఇప్పటికే స్కిల్డ్ కార్మికులకు రూ.15 వేల నుంచి రూ.18,500, సెమిస్కిల్డ్ కార్మికులకు రూ.12 వేల నుంచి రూ.15 వేలకు, అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ.10,340 నుంచిరూ.15 వేలకు పెంపు
- కల్యాణకట్టలో విధులు నిర్వహిస్తున్న పీస్‌రేట్ క్షురకులకు నెలకు రూ.20 వేల కనీస వేతనం
- ఫిబ్రవరిలో తిరుమలలో పీఠాధిపతులు, మఠాధిపతుల సదస్సు
- వందల సంవత్సరాలుగా శ్రీవారి ఆలయ అర్చక కైంకర్యాలను పర్యవేక్షిస్తున్న పెద్దజీయర్ మఠానికి రూ.60 లక్షలు, చిన్నజీయర్ మఠానికి రూ.40 లక్షలు ఆర్థిక సహకారం పెంపు.

కాగా, శ్రీ భగవద్గీత, స్థానిక ఆలయాల క్యాలెండర్లు, గోవింద కోటి పుస్తకాలను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డితో కలిసి ఆవిష్కరించారు.

నెల్లూరు జిల్లా నార్తురాజుపాళెంలో జరిగిన సాధికార సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



కోవూరులో సాధికార ప్రదర్శన

నెల్లూరు జిల్లా నార్తురాజుపాళేనికి తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు

ఘనంగా వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర

బ్రహ్మరథం పట్టిన ప్రజలు.. జై జగన్ నినాదాలతో హోరెత్తిన రాజుపాళెం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం నలుమూలల నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుటుంబాలన్నీ నార్తురాజుపాళేనికి కదలి వచ్చాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన చేయూతతో తాము సాధించిన సాధికారతను ప్రదర్శించాయి. మంగళవారం వైఎస్సార్‌సీపీ రాజుపాళెంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేశాయి. వారికి రాజుపాళెంలో వీధివీధినా ఘనస్వాగతం లభించింది. జై జగన్ నినాదాలతో రాజుపాళెం హోరెత్తింది. యాత్ర అనంతరం జరిగిన బహిరంగ సభలో వేలాదిగా ప్రజలు పాల్గొన్నారు. నేతలు సీఎం జగన్ పేరు పలికిన ప్రతిసారీ ప్రజలు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు చేశారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

జిల్లా వార్తలు

పిచ్ అదిరింది..

- పటేల్ స్టేడియంలో అత్యాధునిక ఆస్ట్రో టర్ఫ్ వికెట్
- క్రీడాకారులకు ఉత్తమ శిక్షణ
- జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యాన కోచింగ్

ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఆస్ట్రోటర్ఫ్ వికెట్‌పై క్రికెట్ శిక్షణ కొనసాగుతోంది. జిల్లా క్రికెట్‌కు కొత్త వెలుగులు తీసుకొచ్చేలా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ వికెట్ ఏర్పాటు చేశారు. ఆస్ట్రోటర్ఫ్ వికెట్ ఏర్పాటుకు 2021లో అప్పటి కలెక్టర్ సర్దార్ పటేల్ స్టేడియం జిమ్నాజియం హాల్ పక్కన స్థలాన్ని కేటాయించారు. దీంతో బాధ్యతలు స్వీకరించిన జిల్లా క్రికెట్ అసోసియేషన్ బాధ్యులు నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఫలితంగా ఆశించిన మేరకు నగరంలోని ఔత్సాహిక క్రికెటర్లు టర్ఫ్ వికెట్‌పై నేర్చుకునేందుకు వస్తున్నారు. హైదరాబాద్ లాంటి మహానగరాలకు పరిమితమమైన టర్ఫ్ వికెట్‌ను రూ.75 లక్షల వ్యయంతో నిర్మించగా.. అసోసియేషన్ ద్వారా కోచ్‌లను నియమించి శిక్షణ ఇప్పిస్తున్నట్లు క్రికెట్ అసోసియేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఎండీ మసూద్‌పాషా తెలిపారు.

– ఖమ్మంస్పోర్ట్స్



ఆస్ట్రో టర్ఫ్ వికెట్‌పై ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు



క్రికెటర్లకు అన్ని సౌకర్యాలు



ఖమ్మం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన టర్ఫ్ వికెట్‌లో శిక్షణ పొందేందుకు వచ్చే క్రికెటర్లకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాం. ఇది పూర్తిస్థాయిలో అసోసియేషన్, జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతోంది. మెరుగైన శిక్షణ ఇచ్చి క్రీడాకారులను తీర్చిదిద్దడమే మా లక్ష్యం.

–వెంకట్, క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి

ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు..



ప్రతిభావంతులైన క్రికెటర్లను గుర్తించి వారిలోని నైపుణ్యం వెలికితీసేందుకు టర్ఫ్ వికెట్ ఏర్పాటుకు ప్రోత్సహించాం. క్రికెటర్లకు ఉత్తమ శిక్షణ ఇచ్చి హెచ్‌సీఏ ఆధ్వర్యంలో జరిగే పోటీల్లో పాల్గొనేలా చూస్తారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకూ శిక్షణ ఇవ్వాలని సూచించాం.

–టి.సునీల్‌రెడ్డి, డీవైఎస్‌ఓ

ఉన్నతస్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యం



ఇప్పటి వరకు జిల్లా నుంచి ఎవరుకూడా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ టోర్నీలో ఆడలేదు. ఇకనైనా ఆడించేలా ఔత్సాహిక క్రికెటర్లతో పాటు వర్తమాన క్రికెటర్లను ప్రోత్సాహించి రంజీ మ్యాచ్‌ల స్థాయికి తీర్చిదిద్దడమే లక్ష్యం. భవిష్యత్‌లో ఉత్తమ క్రీడాకారులను తయారుచేస్తాం. –ఎండీ మసూద్‌పాషా, క్రికెట్ అసోసియేషన్ జిల్లా కోఆర్డినేటర్

40 మందికి పైగా శిక్షణ



టర్ఫ్ వికెట్‌పై ప్రాక్టీస్ కోసం 40 మందికి పైగా క్రీడాకారులు వస్తున్నారు. ఇందులో ఔత్సాహికులు, వర్తమాన క్రికెటర్లు ఉన్నారు. చిన్నారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. జిల్లా క్రికెట్‌కు నూతన జవసత్వాలు నింపి ఉత్తమ క్రికెటర్లను తయారుచేయడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నాం.

–విజయ్‌కుమార్, కోచ్

ప్రజల ఆలోచనలకు అనుగుణంగా పాలన



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన ప్రజాపంథా నేతలు రంగారావు, గుమ్మడి తదితరులు

- పార్టీ మూలసూత్రానికి భిన్నంగా మద్దతు ఇచ్చిన 'ప్రజాపంథా'కు కృతజ్ఞతలు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పోరాట ఫలితాలు, భావజాలం, ఆలోచన విధానాన్ని నలభై ఏళ్లుగా గమనిస్తున్నానని.. వారు అనుకున్నట్లు, ప్రజల ఆలోచన విధానాలకు తగినట్లు పనిచేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఎన్నికల సమయాన తన గెలుపునకు కృషి చేయడంపై ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపేందుకు మంత్రి తుమ్మల ఖమ్మంలోని ఆ పార్టీ కార్యాలయానికి మంగళవారం వెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటు వేయడం అన్నప్పుడు కానీ, తమ ఓటు తామే వేసుకుంటామని చెప్పినప్పుడు కానీ తాను ప్రజాపంథా నాయకులను ఇబ్బంది పెట్టలేదని తెలిపారు. కానీ, ప్రత్యేక పరిస్థితిలో ప్రజాస్వామిక, స్వేచ్ఛాయుత పాలన కావాలని ప్రజాపంథా తనకు మద్దతు ప్రకటించడాన్ని ఎన్నటికీ మరచిపోనని చెప్పారు. ప్రజలు, రాష్ట్ర అవసరాల కోసం పార్టీ మూలసూత్రానికి భిన్నమైన నిర్ణయం తీసుకున్నందున వారి ఆలోచనలకు అనుగుణంగా తాను పనిచేస్తానని తెలిపారు. ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ.. ప్రజలు ఏదైతే కోరుకొని కొత్త ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారో, అందుకు అనుగుణంగా పాలకులు పనిచేయాలని కోరారు. ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు రాయల చంద్రశేఖర్, గుర్రం అచ్చయ్య, జి.రామయ్య, పి.ఝాన్సీ, ఆవుల వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్, మనోహర్‌రాజు, పుసులూరి నరేందర్‌తో పాటు టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ, సాదు రమేశ్‌రెడ్డి, అశ్రీఫ్, గుప్తా వెంకటేశ్వర్లు, చావా నారాయణరావు, పోట్ల వీరేందర్, మిక్కిలినేని నరేంద్ర పాల్గొన్నారు.

హైదరాబాద్ వచ్చి ఎందుకు కలవలేదు?

హైదరాబాద్‌కు వచ్చినా ఎందుకు కలవకుండా వెళ్లారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యను ఆరా తీశారు. పార్టీ కార్యాలయానికి వెళ్లిన మంత్రికి నర్సయ్య, తదితరులు స్వాగతం పలకగా ఆప్యాయంగా హత్తుకుని మాట్లాడారు. ఎందుకు తనను కలవలేదని మంత్రి ఆరా తీయగా రాష్ట్రపతి పర్యటనలో ఉన్నట్లు తెలియడంతో వెనక్కి వచ్చేశానని గుమ్మడి నర్సయ్య బదులిచ్చారు.

'వెంకటయ్య బావి' నవల ఆవిష్కరణ



నవల ఆవిష్కరించిన సిథారెడ్డి, తదితరులు

లక్డీకాపూల్: 'వెంకటయ్య బావి' నవలతో సాహిత్యంలో మూడు ప్రక్రియల్లో దాసరి మోహన్ సాధన చేస్తున్నారని నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ఆధ్వర్యాన మంగళవారం రవీంద్రభారతిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన నవలను ఆవిష్కరించారు. అధ్యక్షుడు కందుకూరి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో రూప్‌కుమార్ డబ్బీకార్ పుస్తకపరిచయం చేయగా కె.గోవర్ధనరావు, పాత్తూరి సుబ్బారావు, నాళేశ్వరం శంకరం, రమాదేవి కులకర్ణి, బి.సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాలికల క్రికెట్ టోర్నీ విజేత 'రంగారెడ్డి'

- రన్నరప్‌గా నిలిచిన మహబూబ్‌నగర్ జట్టు
- మూడో స్థానంతో సరిపెట్టుకున్న ఖమ్మం



మూడో స్థానంలో నిలిచిన ఖమ్మం జట్టు

అశ్వాపురం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలోని గౌతమీనగర్ కాలనీ హోమిబాబా క్రీడామైదానంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నాలుగు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి పాఠశాలల అండర్–17 బాలికల క్రికెట్ పోటీలు మంగళవారం ముగిసాయి. టోర్నీ విజేతగా రంగారెడ్డి జట్టు నిలవగా రన్నరప్‌గా మహబూబ్‌నగర్, మూడో స్థానంలో ఖమ్మం జట్టు నిలిచింది. మంగళవారం జరిగిన మొదటి సెమీస్‌లో రంగారెడ్డి, నిజమాబాద్ జట్లు తలపడగా రంగారెడ్డి జట్టు గెలిచి ఫైనల్స్ చేరింది. రెండో సెమీస్ ఆతిథ్య ఖమ్మం, మహబూబ్‌నగర్ జట్ల మధ్య జరగగా మహబూబ్‌నగర్ జట్టు గెలుపొంది ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. ఫైనల్స్‌లో రంగారెడ్డి – మహబూబ్‌నగర్ జట్లు తలపడగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రంగారెడ్డి జట్టు 12 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 109 పరుగుల భారీ స్కోర్ చేసింది. బ్యాటింగ్‌కు దిగిన మహబూబ్‌నగర్ జట్టు 49 పరుగులకే ఆలౌట్ కావడంతో రంగారెడ్డి జట్టు విజేతగా నిలిచింది. మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో ఖమ్మం – నిజమాబాద్ జట్లు తలపడగా ఖమ్మం జట్టు విజయం సాధించింది. అనంతరం విజేత, రన్నరప్ జట్లకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భారజల కర్మాగారం డీజీఎం ఘంటసాల శ్రీనివాసరావు, ఎంఈఓ వీరస్వామి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి స్టెల్లా ప్రేమ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అనిల్ కుమార్, వీరన్న, ఆదినారాయణ, కందుల శ్రీనివాసరావు, పీఈటీలు పాల్గొన్నారు.

పెద్దమ్మగుడిలో చండీహోమం

పాల్వంచ: భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలం జగన్నాథపురం – కేశవాపురం గ్రామాల మధ్య కొలువైన శ్రీకనకదుర్గ దేవస్థానం(పెద్దమ్మగుడి)లో మంగళవారం చండీహోమం నిర్వహించారు. తొలుత మేళతాళాలు, వేద మంత్రాలతో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను దేవాలయంలోని యాగశాలకు తీసుకొచ్చి మండపారాధన, గణపతి పూజ చేశారు. అనంతరం వేదపండితులు చండీహోమం నిర్వహించి, భక్తులకు ఆశీర్వచనాలతో పాటు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం అందించారు.

షాపులకు బహిరంగ వేలం

శ్రీకనకదుర్గ దేవస్థానం(పెద్దమ్మగుడి) వద్ద షాపులకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. కొత్తగూడెంలోని శ్రీ సీతారామాలయం ఈఓ హెచ్.హరిచంద్రశేఖర్, పెద్దమ్మగుడి ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ అధ్యక్షుడు మహిపతి రామలింగం ఆధ్వర్యాన వేలం ఏర్పాటుచేయగా, షాపింగ్ కాంప్లెక్స్‌లోని మూడో షాప్‌ను ఉప్పాల పాటి రేణుక రూ.50వేలకు, ఐదో షాప్‌ను పాటి వీరభద్రం రూ.8,200, ఏడో షాప్‌ను బి.కవిత రూ.8,600, పదో షాప్‌ను బి.హరీష్ రూ.7,500, 11వ నంబర్ షాప్‌ను బి.వంశీ రూ.32,500 చొప్పున దక్కించుకున్నారు. ఇక ఆరో నంబర్ షాప్ కోసం ఎవరూ రాకపోవడంతో వచ్చేనెల 3వ తేదీకి వాయిదా వేశారు.



చండీ హోమం నిర్వహిస్తున్న అర్చకులు